సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 28 । జనవరి । 2025



హక్కులు హరిస్తున్నారు

ప్రభుత్వ వైఖరిపై వైఎస్సార్ సీపీ నేత పేరాడ తిలక్ మండిపడ్డారు. సర్పంచ్ హక్కులు కాలరాస్తున్నారని అన్నారు. - 8లో



దివ్యాంగులకు చేయూత

దివ్యాంగులకు నేటి నుంచి ఉపకరణాలు అందజేయనున్నారు. ఏర్పాట్లు పూర్తయ్యాయి. - 8లో



న్యూస్‌రీల్

పరీక్ష పాస్ చేస్తామంటూ డబ్బులు వసూలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్‌ల్లో పరీక్ష పాస్ చేస్తామంటూ నాన్ టీచింగ్ సిబ్బంది కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఒక ప్రైవేట్ కళాశాల విద్యార్థులు ఈ మేరకు వర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ మేరకు కొందరు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేసినట్లు తెలిసింది. ప్రధానంగా రీవాల్యుయేషన్, సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ అంశాన్ని ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ వద్ద ప్రస్తావించగా, అలాంటిది తమ దృష్టికి రాలేదని, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం పూర్తిస్థాయిలో పారదర్శకంగా ఉంటుందని అన్నారు. ఎవరైనా పాస్ చేస్తామంటే నమ్మవద్దని, వర్సిటీలో ఫిర్యాదు చేయాలని తెలిపారు. వర్సిటీలో పరీక్షల నిర్వహణ వ్యవస్థ పటిష్టంగా ఉందని అన్నారు. అపోహలు నమ్మవద్దని చెప్పారు.

‘రూపాయి ఖర్చు లేకుండా బెయిల్’



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రెడ్డి సన్యాసి నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కారాగారంలో ఖైదీలుగా ఉన్న నిరుపేదలు రూపాయి ఖర్చు లేకుండా బెయిల్‌పై బయటకు రావడానికి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ఎంతో ఉపయోగపడుతుందని శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రెడ్డి సన్యాసి నాయుడు అన్నారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానం ఆవరణలో ఉన్న లీగల్ సర్వీస్ అథారిటీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. న్యాయ సహాయం పొందాలనుకునే వారు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌ను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఇంతవరకు వంద కేసులకు పైబడి బెయిళ్లు ఇప్పించామని, అలాగే 50 వరకు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించామని, ఇంకా 200 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ లీగల్ ఆఫీసర్ కొమరాపు ఆఫీస్ నాయుడు అన్నారు. సమావేశంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధులు పుట్టా అంజనీ కుమార్, పైడి హర్షవర్ధన్, గేదెల ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలాసలో 30న మినీ జాబ్ మేళా

కాశీబుగ్గ: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డీఆర్‌ఏ, సీడాప్ ఆధ్వర్యంలో పలాసలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఈ నెల 30న గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా మేనేజర్ రమణమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో రెండు కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఐటీఐ పూర్తి చేసి 18–35 ఏళ్ల కలిగిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



బొంతలకోడూరులో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరం

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించే పశువైద్య శిబిరాలు పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకందార్లు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ రాష్ట్ర పరిశీలకులు, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సింహాచలం అన్నారు. తోటపాలేం, బొంతల కోడూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరాలను పరిశీలించారు. అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పాడి ఆవుల పెంపకానికి ప్రాధాన్యత పెరుగుతోందని చెప్పారు. గొర్రెలు, మేకలు పెంపకంతో సైతం మెరుగైన ఆదాయం వస్తుందని చెప్పారు.

ఎన్‌ఓసీ రద్దు చేస్తూ అగ్నిమాపక డీజీ ఉత్తర్వులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఎన్‌ఓసీని రద్దు చేస్తూ రాష్ట్ర విపత్తులు, అగ్నిమాపకశాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు పంపారని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి జె.మోహన రావు అన్నారు. శనివారం షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి విదితమే.

● ఓం సూర్యాయ నమః



టెక్కలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థినులు

రథ సప్తమి సన్నాహకాల్లో భాగంగా సోమవారం జిల్లావ్యాప్తంగా సూర్య నమస్కారాల క్రతువు విజయవంతంగా జరిగింది. కలెక్టర్ మొదలుకుని విద్యార్థుల వరకు అందరూ ఈ యాగంలో భాగమయ్యారు. బడుల్లో ఉపాధ్యాయులు పిల్లల చేత సూర్య నమస్కారాలు చేయించి వాటి ప్రాశస్త్యాన్ని వివరించారు. – సాక్షి నెట్‌వర్క్



అరసవల్లి: ఆలయంలో యోగాసనాలు వేస్తున్న యోగ సాధకులు, అధికారులు (ఇన్‌సెట్లో) సూర్య నమస్కారాలు చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



జి.సిగడాం: కేజీబీవీలో సూర్య నమస్కారాలు



కవిటి: ఇద్దివానిపాలెం ఉన్నత పాఠశాలలో సూర్యనమస్కారాల సాధన



సరుబుజ్జిలి: రొట్టవలస హైస్కూల్‌లో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

ఎక్సైజ్‌లో గలీజ్ గబ్బు



- ఎక్సైజ్ సిబ్బంది అక్రమ వసూళ్లు
- రెన్యువల్ ఫీజుతో ముడుపులు సమర్పించుకున్న వ్యాపారులు
- తొలుత షాపుకి రూ.2 లక్షలు డిమాండ్.
- జిల్లాలో రూ.50వేల నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు
- వసూళ్ల సొమ్ము ఎక్కడికెళ్లిందని మద్యం ట్రేడ్ వర్గాల్లో చర్చ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీతో దండిగా సంపాదించుకోవచ్చని వ్యాపారులు కలలు కన్నారు. నయానోభయానో షాపులు దక్కించుకున్నారు. కానీ కమీషన్ల విషయంలో ముందు చెప్పిన మాటను చంద్రబాబు అమలు చేయకపోవడంతో మద్యం వ్యాపారులకు చుక్కలు కనబడుతున్నాయి. ఆశించిన లాభాలు రావడం లేదని లబోదిబోమంటున్నారు. టర్నోవర్ పెరిగితే కొంతైనా కవర్ చేసుకోవచ్చని బెల్ట్‌షాపులపై దృష్టి పెట్టారు. ఈ సమయంలో వ్యాపారుల నెత్తిన ఎక్సైజ్ వాళ్లు భారం మోపారు. లీజు రెన్యువల్ ముసుగులో అనధికార వసూళ్లకు తెగబడ్డారు. షాపుకి రూ.2 లక్షలు చొప్పున డిమాండ్ చేశారు. తమకు అంత వ్యాపారం జరగడం లేదని సంప్రదింపుల తర్వాత కొంతమేరకు తగ్గారు. షాపు విక్రయాల సామర్థ్యం మేరకు వసూళ్లకు ఒప్పందం చేసుకున్నారు. రూ.50వేల దగ్గరి నుంచి రూ.2లక్షల వరకు ముడుపులు ముట్టజెప్పుకున్నారు. ఇదంతా పండగ ముందే జరిగిపోయింది.

లాభాల్లేవని నిరాశ పడుతున్న వేళ..

మద్యం వ్యాపారమంటేనే అటు వ్యాపారులకు, ఇటు ఎక్సైజ్ వాళ్లకు పండగ. ఒకప్పుడు అంత వైభవంగా జరిగేది. ఇరువర్గాలకు డబ్బులే డబ్బులు. గత ఐదేళ్లలో ప్రభుత్వమే మద్యం షాపులు నడవడంతో ప్రైవేటు వ్యక్తులకు అవకాశం లేకుండా పోయింది. బయట నుంచి వచ్చే ముడుపులను ఎక్సైజ్ అధికారులు కోల్పోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేటు మద్యం వ్యాపారానికి రెక్కలు వచ్చాయి. ఆదాయమే ప్రధానంగా భావించిన కూటమి ప్రభుత్వం తమకు అలవాటైన రీతిలో మద్యం దుకాణాల కోసం టెండర్లు పిలిచింది. ఆ టెండర్ల ప్రక్రియలో ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. షాపులు ఎవరికి దక్కినా చివరకు అధికార పార్టీ నాయకులు, సిండికేట్ల చేతికే చిక్కాయి. గతంలో చూసిన లాభాల దృష్ట్యా కొన్నిచోట్ల బెదిరింపులతో, మరికొన్ని చోట్ల గుడ్‌విల్ ఇచ్చి తీసుకున్న పరిస్థితులు ఉన్నాయి. అంతా కొలిక్కి వచ్చింది. దుకాణాల ఏర్పాటు, విక్రయాలు ప్రారంభమైపోయాయి. కానీ అనుకున్నంత లాభాలైతే వ్యాపారులకు రాలేదు. వారికొచ్చే కమిషన్ ప్రభుత్వం ఆశించినంతగా ఇవ్వకపోవడంతో మద్యం వ్యాపారం బాగోలేదని దాదాపు నిరాశకు గురయ్యారు. ఇదంతా ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఏదొకటి చేద్దాంలే అని ప్రభుత్వ పెద్దలు పరోక్షంగా చెప్పడం, అదే సమయంలో బెల్ట్‌షాపులకు స్వేచ్ఛ నివ్వడంతో కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఎక్సైజ్ బాదుడు..

లైసెన్సురెన్యువల్ ఫీజుతోపాటు తమ ‘ఫీజు’ కూడా చెల్లించాలని ఎక్సైజ్ అధికారులు వ్యాపారుల ముందు డిమాండ్ చేశారన్న వాదనలు ఉన్నాయి. ఆ బాధ్యతను సర్కిల్ పరిధిలో ఒక అధికారికి, వ్యాపార వర్గాల నుంచి ఒకరికి అప్పగించారు. జిల్లాలో దాదాపు 158 మద్యం షాపులు ఉన్నాయి. ఈ లెక్కన షాపుల విక్రయాల సామర్థ్యం మేరకు ఎవరి నుంచి ఎంత వసూలు చేశారో వారికే ఎరుక. ఉదాసీనంగా ఉండాలంటే ముడుపులు ఇవ్వాల్సిందే అని పట్టుబట్టడంతో ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది.

ఎవరికెళ్లాయి..?



ఈ వసూళ్లకు మొత్తం సూత్రధారి, పాత్రధారి ఎవరు అన్నదానిపైనే చర్చ నడుస్తోంది. ఈ సొమ్ము అంతా ఎక్కడికి వెళ్లింది? ఎవరి ఆదేశాల మేరకు వసూళ్లకు తెగబడ్డారు? ఉన్నత స్థాయిలోనా, ఉత్తరాంధ్ర స్థాయిలోనా, జిల్లా స్థాయిలోనా అన్న చర్చ అంతటా నడుస్తోంది. అంతేకాదు ఏ స్థాయిలో ఎవరికెంత ముట్టింది తదితర వాటిపై ప్రస్తుత మద్యం ట్రేడ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. దీనిపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతినాయుడును ‘సాక్షి’ వివరణ కోరగా రెన్యువల్ ఫీజులు తప్ప అనధికార వసూళ్లు చేసినట్టుగా తన దృష్టికి రాలేదని చెప్పారు.

నేషనల్ గేమ్స్ ఖోఖో పోటీలకు ప్రవీణ్ ఎంపిక



తాజాగా సాధించిన మెడల్‌తో కొరగాన ప్రవీణ్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక నేషనల్ గేమ్స్(సీనియర్స్) ఖోఖో చాంయన్‌షిప్ పోటీలకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొరగాన ప్రవీణ్ ఎంపికయ్యాడు. ఈ పోటీలు ఉత్తరాఖండ్‌లోని హలద్వా వేదికగా ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు కొనసాగనున్నాయి. పలాసకు చెందిన ఈ యువ క్రీడాకారుడు ఆంధ్రా పురుషుల జట్టుతో కలిసి పోటీల కోసం ఉత్తరాఖండ్ చేరుకున్నాడు. పలాసలో ఐటీఐ చేస్తున్న ప్రవీణ్ ఇప్పటికే సామర్లకోట వేదికగా జరిగిన స్టేట్‌మీట్, ఢిల్లీ వేదికగా జరిగిన నేషనల్ మీట్‌లో మెరుగైన ఆటతీరు కనబర్చడంతో జాతీయ క్రీడాపోటీల్లో పాల్గొనే ఆంధ్రా జట్టుకు ఎంపికచేశారు. ప్రవీణ్ తండ్రి కొరగాన చిన్నారావు చిన్నపాటి పండ్ల వ్యాపారం చేస్తు కుటుంబాన్ని పోషిస్తుండగా, తల్లి మీన గృహిణి. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదవగా, గుంటూరు శాప్ స్పోర్ట్స్ అకాడమీ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియెట్ పూర్తిచేశాడు. ప్రస్తుతం పలాసలోని డాక్టర్ కణితి విద్యాసంస్థల్లో ఐటీఐ చేస్తున్నాడు.

పూర్ణారావుకు గోల్డ్ మెడల్



పూర్ణారావు

టెక్కలి: టెక్కలి మండలం శ్రీరంగం గ్రామానికి చెందిన పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు చాపరా పూర్ణారావు ఈజిప్టులో జరిగిన ఇంటర్నేషనల్ పారా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ నెల 21 నుంచి 26 వరకు ఈజిప్టులో జరిగిన పారా బ్యాడ్మింటన్ –2025 టోర్నమెంట్‌లో భాగంగా సింగిల్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. డబుల్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించగా, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు.

రోడ్డెక్కిన వీఓఏలు



ధర్నా చేస్తున్న వీఓఏలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఆర్‌డీఏ వెలుగు పరిధిలో గ్రామస్థాయిలో పనిచేస్తున్న గ్రామ ఆర్గనైజేషన్ సహాయకుల(వెలుగు వీఓఏ) సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభావతి, జి.అసిరి నాయుడు డిమాండ్ చేశారు. వీఓఏల 7 నెలలు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలు మూడు రోజులు కొనసాగిస్తామని చెప్పారు. అనేక రకాల పనులు చేయించుకుంటున్నా వీఓఏల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు నెలలుగా జీతాలివ్వకుంటే కుటుంబాల పోషణ ఎలా సాగుతుందన్నారు. ఆన్‌లైన్ సైట్‌లో మార్పులు చేయాలని, కొత్త సిమ్‌లు ఇవ్వాలని, రీచార్జి చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలకు సీఐటీయూ జిల్లా నాయకులు అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఆర్.ప్రకాష్, వీఆర్ఏ సంఘం జిల్లా అధ్యక్షులు త్రినాధరావు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలలో సంఘం నాయకులు డి.జోగారావు, జి.యర్రయ్య, వై.అనురాధ, కె.మన్మధరావు, లక్ష్మి, ఎస్.రాజేశ్వరి, నర్తు మహాలక్ష్మి, పి.రమాదేవి పాల్గొన్నారు.


రాజకీయ వేధింపులు ఆపాలి

జిల్లాలో వీఓఏలపై రాజకీయ కక్షలకు పాల్పడుతున్నారు. వీటిని నిలిపివేయాలి. వీఓఏలపై పని భారం తగ్గించాలి. పెరుగుతున్న నిత్యవసరాల ధరలకు అనుగుణంగా వీఓఏలకు జీతాలు పెంచాలి. సకాలంతో జీతాలు మంజూరు చేయాలి.

– ఎం.ప్రభావతి, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు

చెప్పింది చేయాల్సిందే..

- జిల్లా కేంద్రంలో అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు
- కీలక నేత, షాడో నేతల టార్చర్ తట్టుకోలేక పోతున్న పరిస్థితి
- మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు
- ఒత్తిళ్లే కారణమని వాదనలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. నేతలు, షాడో నేతల ఆధిపత్య పోరులో అధికారులు నలిగిపోతున్నారు. నేతల సతాయింపు ఎక్కువైపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. కొంతమందైతే ఇక్కడి నుంచి వెళ్లిపోతే మంచిదన్న ఆలోచనకు వచ్చేస్తున్నారు. మరికొందరు ఉద్యోగాన్ని సైతం వదులుకోవడానికి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దక్షిణామూర్తి స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు పెట్టుకోవడం, అనుమతి కోసం ప్రభుత్వానికి పంపించడం చర్చనీయాంశమైంది. ఎప్పటి నుంచో తనకు ఈ ఆలోచన ఉందని దక్షిణామూర్తి బయటకు చెబుతున్నా.. లోలోపల ఒత్తిళ్లే కారణమన్న వాదనలు ఉన్నాయి.

ఓ వైపు అభద్రత.. మరో వైపు అశాంతి

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకే కాదు అధికారులకు కూడా మానసిక ప్రశాంతత కరువైంది. నగరంలో నిత్యం ఏదో ఒక ఘటన చోటు చేసుకుంటోంది. హత్యలు, దాడులు, అత్యాచారాలు, దొంగతనాలు, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు తదితర పరిణామాలతో ప్రజల్లో భయాందోళన నెలకుంది. ఎప్పుడెక్కడ ఏం జరుగుతుందో ఎవరేం చేస్తారో అన్న భయం పట్టుకుంది. ఎవరి వైపు నుంచి ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనన్న అభద్రతా భావం నెలకొంది. ప్రజలకు ఇలాంటి పరిస్థితి ఉంటే అధికారులకు మరో రకమైన సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కార్పొరేషన్‌లో ఉన్న పలువురిపై నేతల మాటలు, ఒత్తిళ్లు తార స్థాయికి చేరిపోయాయి. టెండర్ల దగ్గరి నుంచి పనులు చేపట్టే వరకు నేతల సతాయింపును తట్టుకోలేకపోతున్నారు. ముఖ్యంగా రథసప్తమి వేడుకల పేరుతో కొందర్ని టార్చర్ పెడుతున్నారనే వాదనలు ఉన్నాయి. తొందరగా పనులు చేపట్టాలన్న ఆరాటంలో తమ్ముళ్లకు పంచి పెట్టిన కాంట్రాక్ట్ వర్క్‌లను నాణ్యతకు తిలోదకాలిచ్చి త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులపై చేస్తున్న ఒత్తిళ్లు అన్నీ ఇన్నీ కావు. ఈ క్రమంలో అధికారులు సైతం తప్పులు చేసే పరిస్థితికి వెళ్లిపోయారు. దీనికి స్థానిక మిల్లు జంక్షన్ వద్ద బాబూ జగ్జీవన్‌రావు విగ్రహం వద్ద నిర్మించ తలపెట్టిన ఫౌంటెనే ఉదాహరణ. ఒకసారి కట్టి, మరొకసారి కొంత కూల్చి, తర్వాత నిర్మాణం పూర్తి చేసి, అంతా అయ్యాక మొత్తం కూల్చేయడం నగర ప్రజలను విస్మయానికి గురి చేసింది. ప్రజాధనం దుర్వినియోగమైపోతుందని అది చూసిన వారంతా పెదవి విరుస్తున్నారు. ఇక గోడలకు రంగులు విషయంలో కూడా అదే జరిగింది. టీడీపీ నాయకులకు కాంట్రాక్ట్ ఉపాధి కోసం బాగున్నచోటే మళ్లీ రంగులేసే కార్యక్రమంతో కోట్ల రూపాయం దుర్వినియోగం చేశారు. ఈ విషయంలో అధికారులు ఏమీ మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారు.

కనీసం గౌరవం లేకుండా..

అధికారులకు కనీస గౌరవం కూడా లేకుండా పోయింది. నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లో తీసుకుంటే ఒక కీలక నేత నోటికొచ్చినట్టు మాట్లాడేస్తున్నారు. పరుష పదజాలంతో నోరు జారడంతో ఉద్యోగుల ఆత్మాభిమానం దెబ్బతినే పరిస్థితికి వెళ్లిపోయింది. ఏక వచనంతో మాట్లాడటం, తానంటే గౌరవం లేదా అని అరవడం, చెప్పినట్టు చేయకపోతే మామూ లుగా ఉండదని బెదిరించడంతో కార్పొరేషన్‌లో మానసిక ప్రశాంతత కొరవడింది. అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లలో ఎంతమంది పాల్గొన్నా.. తాను చెప్పిన వ్యక్తికి ఇచ్చేలా చేయాలని సతాయించడం, టెండర్లు పిలవకుండా కొన్ని వర్క్‌లను నామినేటేడ్‌గా ఇచ్చేయాలని ఒత్తిడి చేయడం, తాను చెబితే తప్ప మరొకరు చెప్పినది చేయొద్దని హుకుం జారీచేయడంతో అధికారులు ఇరకాటంలో పడుతున్నారు. కీలక నేత అజమాయిషీ ఇలా ఉంటే, మంత్రుల షాడోలుగా చెప్పుకుని మరో ఇద్దరు కార్పొరేషన్‌లో వేలు పెట్టేశారు. వాళ్లు కూడా అదే స్థాయిలో ఒత్తిళ్లకు గురి చేస్తున్నారు. తాము చెప్పింది చేయాలని, తాము మంత్రుల మనుషులమని, తేడా వస్తే ఇబ్బందేనని బెదిరిస్తున్నారు. దీంతో కార్పొరేషన్ ఉద్యోగులు నలిగిపోయి, ఏమీ చేయలేని పరిస్థితిలో కుమిలిపోతున్నారు. ఒక్క కార్పొరేషన్‌లోనే కాదు అరసవల్లి దేవస్థానంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలో ఉన్న పలువురి అధికారుల్ని సైతం ఇదే రకంగా ఇబ్బంది పెడుతున్నారు. ఫోన్ లోనే ఎడాపెడా వాయించేస్తున్నారు.



క్లుప్తంగా

సెక్యూరిటీ గార్డుపై హౌస్ కీపర్ ఫిర్యాదు

టెక్కలి రూరల్: స్థానిక జిల్లా ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కె.భాస్కర్ అనే వ్యక్తి అక్కడే పనిచేస్తున్న మహిళ శానిటేషన్ వర్కర్(హౌస్ కీపర్)తో అసభ్యకరంగా మాట్లాడడంతో ఆమె టెక్కలి పోలీసుకు ఫిర్యాదు చేసింది. ఆస్పత్రి వర్గాలు తెలిపిన వివరాల మేరకు.. ఆస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు శానిటేషన్ వర్కర్‌తో ఆదివారం అసభ్యకరంగా మాట్లాడడంతో ఆమె అతడిని కొట్టినట్లు తెలుస్తోంది. అనంతరం ఆమె బంధువులు సైతం ఆస్పత్రికి వచ్చి మందలించారు. అనంతరం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావుని వివరణ కోరగా విషయం తన దృష్టికి వచ్చిందని, పూర్తి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

భవిష్యత్తులో సాంకేతికతదే అగ్రస్థానం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



విద్యార్థినికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రపంచవ్యాప్తంగా భవిష్యత్తులో సాంకేతికతదే అగ్రస్థానమని, అందులోనూ ఏఐ, ప్రోగ్రామింగ్, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్‌లు ముందు వరుసలో ఉంటాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం కుదుర్చుకుని స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాం ద్వారా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ, డేటా సైన్స్‌పై అవగాహన ఉన్నవారు విస్తృత అవకాశాలు సొంతం చేసుకుంటారన్నారు. ఆ దిశగా ఆలోచించి పద్మావతి జూనియర్ కళాశాల ఐఐటీ మద్రాస్‌తో స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగమవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇంజినీరింగ్ రంగంలోకి అడుగుపెట్టే సమయంలో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పించడంతోపాటు తగిన మార్గదర్శకత్వాన్ని అందించడం జరిగిందని కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు గ్రామ సమీప జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోరుమజ్జిపాలేం గ్రామానికి చెందిన కరుకోల శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీనివాసరావు తన ద్విచక్ర వాహనంపై శ్రీజగన్నాథపురం గ్రామం నుంచి కోటబొమ్మాళి వైపు వస్తున్నాడు. అదే సమయంలో అతని బైక్ అదుపుతప్పి పోడుగుపాడు గ్రామం వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనపై కోటబొమ్మాళి ఎస్‌ఐ వి.సత్యనారాయణ వివరాలు సేకరించారు.

ఫిబ్రవరిలో ఉత్తరాంధ్ర పాల పోటీలు

టెక్కలి రూరల్: ఫిబ్రవరి చివరి వారంలో పాత శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిలోని పాడి పశువుల మధ్య పాల పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి ఉన్నటువంటి పాడి రైతులు తమను సంప్రదించాలని కోటబొమ్మాళి పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు మూడు జిల్లాలకు చెందిన పాడి రైతులు తమ పశువులను పట్టుకుని విజయనగరం జిల్లా తోటపాలేం గ్రామానికి చేరుకోవాలన్నారు. అక్కడ మూడు రోజులు పాటు ఉండాల్సి వస్తుందని తెలిపారు. పశువులు రవాణా, దాణా, వసతి, నీటి సౌకర్యంతో పాటు రవాణ సమయంలో బీమా సదుపాయం ఉచితంగా కల్పించబడుతుందని తెలిపారు. ఎక్కువ పాలు ఇచ్చే ఆవులకు ప్రథమ బహుమతి కింద రూ.50 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.40 వేలు, తృతీయ బహుమతి కింద రూ.25 వేలు పాడి రైతులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

కొబ్బరికి కష్టకాలం..!

- మొక్కలను ధ్వంసం చేస్తున్న అడవి పందులు
- అదేస్థాయిలో ఆశిస్తున్న పురుగులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఉద్యాన రైతులు



అడవి పందులు ధ్వంసం చేసిన మొక్కను చూపిస్తున్న రైతు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం పెద్ద కొడుకుగా కొబ్బరిని అభివర్ణిస్తారు. ఈ ప్రాంత ప్రజల జీవనాధార పంటల్లో కొబ్బరిది ప్రథమ స్థానం. సోంపేట, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సుమారు 14,000 హెక్టార్ల విస్తీర్ణంలో కొబ్బరి పంట సాగు చేస్తున్నారు. అయితే లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కొబ్బరి పంట నేడు కకావికలం అవుతోంది. ఒక వైపు రాత్రి వేళల్లో అడవి పందులు స్వైర విహారం చేస్తూ కొబ్బరి మొక్కలను ధ్వంసం చేస్తుండగా, మరోవైపు పంటకు తెగుళ్లు ఆశించి పొట్ట దశలోనే నాశనం చేస్తున్నాయి. దీంతో ఏం చేయాలో తోచక రైతులు అయోమయం చెందుతున్నారు.

తిత్లీతో తల్లడిల్లి


2018 అక్టోబర్‌లో బీభత్సం సృష్టించిన తిత్లీ తుఫాన్‌తో కొబ్బరి పంట తీవ్రంగా నష్టపోయి ఉద్దానం రైతు తల్లడిల్లిపోయాడు. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పంటకు పూర్వ వైభవం తీసుకురావడానికి ఉచితంగా కొబ్బరి మొక్కలను అందించి అండగా నిలిచింది. పంట సాగు కోసం రాయితీలు, అధునాతన పరికరాలు అందించి ప్రోత్సహించింది. దీంతో కొబ్బరి రైతులు ఎన్నో ఆశలతో నష్టపోయిన కొబ్బరి చెట్ల స్థానంలో మళ్లీ కొబ్బరి మొక్కలను నాటారు. అలాగే కొంతమంది రైతులు కడియం నుంచి డబ్బులు ఇచ్చి కొబ్బరి మొక్కలను కొనుగోలు చేసుకున్నారు. అయితే రైతులు ఎన్నో ఆశలతో సాగు చేస్తున్న పంట ఆశాజనకంగా ఉన్న సమయంలో, అడవి పందులు రాత్రి వేళల్లో ఆహారం కోసం సంచరిస్తూ కొబ్బరి కందను తినేందుకు మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి.

ఆశిస్తున్న పురుగులు

కొబ్బరి పంటను అనేక రకాల పురుగులు ఆశిస్తూ నాశనం చేస్తున్నాయి. వీటిలో ప్రధానంగా నల్ల ముట్టె పురుగు, కొమ్ము పురుగు, ఎర్రముక్కు పురుగు, ఆకుతేలు, నల్లి, కొబ్బరి, స్లగ్ గొంగిళి పురుగు తదితర పురుగులు రైతుల పాలిట శాపంగా మారాయి. ఈ పురుగులు పంటను ఆశించి కొబ్బరి కొమ్మలు, కొబ్బరి మొవ్వలోకి చేరి నాశనం చేస్తున్నాయి.



ధ్వంసమైన కొబ్బరి మొక్క



పురుగులు



పురుగు సోకి కుళ్లిపోతున్న కొబ్బరి మొక్క

నివారణ చర్యలు

పురుగు సోకి నష్టపోయిన కొబ్బరి చెట్లను వెంటనే తొలగించాలి. భూమిలో ఉన్న చెట్టు భాగాన్ని పూర్తిగా తవ్వి తగలబెట్టాలి. అలాగే తోటల్లో పశువుల ఎరువులను కుప్పలుగా వేయరాదు. కొబ్బరి మొక్కను నిరంతరం పరిశీలిస్తూ మూడు నెలలకొకసారి కొబ్బరి మొక్క మొవ్వలు, ఆకు వలయాల్లో వేప పిండి వేయాలి. మెటరైజియం ద్రావణం పిచికారీ చేయాలి. సెటిరా గులుకులు మొవ్వలకు కట్టడం వలన పురుగు ఆశించదు.

రక్షణ చర్యలు చేపట్టాలి



పంటను నాశనం చేస్తున్న అడవి పందులు, ఆశిస్తున్న పురుగుల నుంచి కాపాడుకునేందుకు కొన్ని రక్షణ చర్యలు చేపట్టాలి. అడవి పందులు రాకుండా కొబ్బరి మొక్క చుట్టూ తల వెంట్రుకలు లేదా పాత చీరలు కట్టాలి. పందులు సంచరిస్తున్న ప్రాంతాల్లో సల్ఫర్ వేయాలి. అలాగే పంటకు ఆశిస్తున్న పురుగుల నియంత్రణకు వేప నూనె, వెల్లుల్లి సబ్బు మిశ్రమం పిచికారీ చేయాలి.

– సునీత, ఉద్యానశాఖాధికారి, వజ్రపుకొత్తూరు మండలం

పశువుల అక్రమ రవాణా అడ్డగింత



టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న పశువులు

నరసన్నపేట: జాతీయ రహదారిపై అనుమతి లేకుండా తరలిస్తున్న 27 పశువులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం వేకువజామున పట్టుకున్నారు. నరసన్నపేటతో పాటు పోలాకి, జలుమూరు మండలాల్లో వివిధ గ్రామాల నుంచి 8 లగేజీ వాహనాల్లో వీటిని బుడుమూరు సంతకు తరలిస్తున్నారు. జాతీయ రహదారిపై మడపాం టోల్‌గేట్ వద్ద వీటిని పట్టుకొని నరసన్నపేట పోలీసులకు అప్పగించారు. నరసన్నపేట ఏఎస్‌ఐ అశిరినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీటిని కొత్తవలస గోశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఆహారం పెట్టడానికి అనుమతివ్వాలి

అక్రమ రవాణా అవుతున్న పశువులను గోశాలకు తరలించేలోపు ఆ పశువులకు స్టేషన్ వద్ద ఆహారం పెట్టడానికి అనుమతినివ్వాలని ఈశ్వర్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి మార్పు విజయకుమార్ కోరారు. పోలీసులు పట్టుకుంటున్న పశువులు గంటల తరబడి స్టేషన్ వద్ద ఉంచుతున్నారని, వీటికి ఆహారం, నీరు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయన్నారు. ఇటువంటి కేసుల్లో స్టేషన్ వద్ద పశువులకు ఆహారం పెట్టేందుకు అనుమతినిస్తే తాము ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు నరసన్నపేట సీఐ, ఎస్‌ఐలకు విజ్ఞప్తి చేశారు.

కల్లు గీత కులాలకు పది శాతం మద్యం దుకాణాలు

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాలో 2024–26 ఆర్థిక సంవత్సరానికి గాను నూతన మద్యం పాలసీలో భాగంగా కల్లు గీత కులాల వారికి పది శాతం మద్యం దుకాణాలు కేటాయించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిలో భాగంగా 16 దుకాణాలకు గాను కులాల వారీ యూనిట్లు కేటాయించారు. దుకాణాలకు దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతిలో చేసుకోవాలి. వచ్చే నెల 5న సాయంత్రం వరకు స్వీకరిస్తారు. 7న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో కలెక్టర్ చేతుల మీదుగా డ్రా తీస్తారు. కులాల వారీగా చూసుకుంటే ఆమదాలవలస మున్సిపాలిటీ, బూర్జ, సరుబుజ్జిలి, పోలాకి, పాతపట్నం, నందిగాం, వజ్రపుకొత్తూరు, మందస, ఇచ్ఛాపురం, కవిటి ఎక్సైజ్ స్టేషన్ల తరఫున దరఖాస్తు చేసుకునేవారు శ్రీనయన కులం వారై ఉండాలి. సెగిడి కులం వారు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్, కొత్తూరు, టెక్కలి, కంచిలి ఎక్సైజ్ స్టేషన్లలోను, యాత కులం వారు హిరమండలం, గౌడ కులం వారు ఇచ్ఛాపురం రూరల్ ఎక్సైజ్ స్టేషన్లు దరఖాస్తులకు కేటాయించారు.

సర్పంచ్‌ల హక్కులను హరిస్తున్నారు



జెడ్పీ సమావేశ మందిరం గేటు వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- మీకోసంలో పేరాడ తిలక్ ఫిర్యాదు
- పోలీసుల అతిప్రవర్తనతో వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామాల్లో రాజ్యాంగానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం సర్పంచ్‌ల హక్కులను హరిస్తోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం పట్టణంలోని జిల్లా పరిషత్‌లో నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి విచ్చేసి కలెక్టర్‌కు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధులు, మండలాలకు జిల్లా పరిషత్ నుంచి కేటాయించిన నిధులు, గ్రామ పంచాయతీలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో రాజకీయ ఒత్తిళ్లతో అధికారుల నిర్వాహకం వల్ల తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. మండల పరిషత్ నిధుల వినియోగానికి సంబంధించి సభ్యులు ఆమోదించిన పనులను చేపట్టేందుకు సంబంధిత ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులు సహకరించడం లేదని తెలిపారు. గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులతో తీర్మానం మేరకు పనులు చేపడుతున్నప్పటికీ ఇంజినీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఎంబుక్‌లు రికార్డింగ్ చేయకుండా రాజకీయ ఒత్తిళ్లలో బిల్లులు పెట్టడం లేదని పేర్కొన్నారు. టెక్కలి నియోజకవర్గంలో అధికారులు స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తూ ప్రజాప్రతినిధులను అగౌరవ పరుస్తున్నారని తెలిపారు. చట్ట పరిధిలో పనిచేయని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

– అడ్డుకున్న పోలీసులు

పేరాడ తిలక్ ఆధ్వర్యంలో టెక్కలి నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు ప్రజా సమస్యల వేదికలో కలెక్టర్‌కి విన్నవించేందుకు వచ్చారు. అయితే వారిని కలెక్టర్‌కు కలవనివ్వకుండా పోలీసులు జెడ్పీ సమావేశ మందిరం గేటు వద్ద అడ్డుకున్నారు. కలెక్టర్‌ని కలిసి సమస్య వివరించి వెళ్తామని పోలీసులకు నచ్చజెప్పినా వినిపించుకోలేదు. దీంతో వారంతా గేటు ముందు బైటాయించి పోలీసుల తీరుపై నిరసన తెలిపారు. అప్పుడు కలెక్టర్ జోక్యం చేసుకొని వారిని పంపించాలని ఆదేశించారు. తొలుత డీఆర్వో వేంకటేశ్వరరావు వచ్చి తనకు వినతి ఇవ్వమని చెప్పారు. అయితే తాము కలెక్టర్‌కి మాత్రమే వినతిపత్రం ఇస్తామని చెప్పారు. అనంతరం కలెక్టర్ లోపలికి రమ్మని పిలిచి వినతి తీసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు దువ్వాడ వాణి, రోణంకి మల్లయ్య, పేడాడ భార్గవి, నక్క

అర్జీల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మీకోసంలో 112 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజలు ఇచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(మీకోసం)ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 112 వినతులు స్వీకరించారు. పరిష్కరించిన అర్జీలకు ఖచ్చితమైన సమాచారం ఉండాలని కలెక్టర్ సూచించారు. స్వీకరించిన అర్జీల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వే అండ్ లాండ్ రికార్డులు, ఏపీ హౌసింగ్, గిరిజన సంక్షేమ, ఇంజినీరింగ్, ఏపీ ఈపీడీసీఎల్, పశుసంవర్ధక శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, విభిన్న ప్రతిభావంతులు, గ్రామీణాభివృద్ధి, స్కూల్ ఎడ్యుకేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 54 వినతులు



ఎస్పీ మహేశ్వరరెడ్డితో సమస్య చెబుతున్న వృద్ధుడు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక (ఎస్పీ గ్రీవెన్స్)కు అర్జీదారుల నుంచి 54 వినతులు వచ్చాయి. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి వినతులు స్వీకరించి సకాలంలో సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

అన్నదాతలపై కూటమి అక్కసు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల రామారావు



దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆరుగాలం కష్టపడి పండించిన రైతన్నలకు కూటమి ప్రభుత్వం కన్నీటినే మిగిల్చిందని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక దళారుల చేతికి చిక్కి విలవిలలాడుతున్నారని వైఎస్సార్ సీపీ కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా రైతులను వంచించడం చంద్రబాబునాయుడుకి కొత్తేమీ కాదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో లాంఛనంగా అందజేసిన రైతు భరోసా పథకం ఊసే లేకపోగా, ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం మంగళం పాడిందన్నారు. పెట్టుబడి సాయం అందక రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ వరికోతలు పూర్తై రెండు నెలలు కావస్తున్నా, పొలాల్లో వరి కుప్పలు దర్శనమిస్తున్నాయన్నారు. జిల్లాలో 10 లక్షల టన్నుల ధాన్యానికి గాను, కేవలం 4.10 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారన్నారు. కూటమి పాలనలో రైతులకు ఎదురుచూపులే మిగిలాయని మండిపడ్డారు.

పాల రైతులకు న్యాయం చేయండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రాలకు పాలు పోస్తున్న రైతులకు న్యాయం చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు భవిరి కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖ డెయిరీలో ఆవుపాలు లీటర్‌కు రూ.5లు వరకు గత 3 నెలలుగా తగ్గించారన్నారు. ఇప్పుడు పాల సేకరణ కేంద్రాలకు పాలు పోస్తున్న రైతుల ఆవుపాలలో 10 శాతం పాలు వెనక్కి అర్థంతరంగా తీసుకోకుండా పంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకొని పాల రైతులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వర్ణ ప్యాలెస్ లక్కీ డ్రా విజేతలు వీరే



లక్కీ డ్రా తీస్తున్న షాపు యజమానులు, ప్రజాప్రతినిధులు

నరసన్నపేట: పట్టణంలోని స్వర్ణ ప్యాలెస్‌లో సోమవారం చేపట్టిన లక్కీ డ్రాలో ఐదుగురిని విజేతలుగా ప్రకటించింది. దీంట్లో మొదటి బహుమతి సత్యవరానికి చెందిన పి.శ్రీనివాసరావుకు పల్సర్ బైక్, విశాఖపట్నంకు చెందిన టి.పద్మజకు ద్వితీయ బహుమతిగా ఎలక్ట్రిక్ బైక్, టెక్కలికి చెందిన ఎస్.ఈశ్వరసాయికి వాషింగ్ మిషన్, నాల్గో బహుమతిగా సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన శోభన్‌కు రిఫ్రిజరేటర్, ఐదో బహుమతిగా రేగుపాడుకు చెందిన ఎస్.మల్లేశ్వరరావుకు వాటర్ ఫిల్టర్ అందజేశారు. ఈ లక్కీ డ్రా సర్పంచ్ బూరెల శంకరరావు, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు ఆధ్వర్యంలో స్వర్ణ ప్యాలెస్ యాజమానులు నానాజీ, శంకర్‌లు నిర్వహించారు.

చర్యలు తీసుకోవాలి



గ్రీవెన్స్‌కి వచ్చిన గోనెపాడు గ్రామస్తులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సరుబుజ్జిలి మండలంలోని గోనెపాడు గ్రామంలో గ్రామ కంఠం భూమిని జిరాయితీ భూమిగా మార్చినవారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ గ్రీవెన్సులో వినతిపత్రంను అందజేశారు. గ్రామంలోని సుమారు 36 కుటుంబాలకు సంబంధించిన పెరడు స్థలాల గ్రామ కంఠాన్ని వీఆర్వో అక్రమంగా జిరాయితీగా నమోదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అక్రమాలకు పాల్పడిన వీఆర్వో, ఇతర వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటుగా గ్రామస్తులు ఉన్నారు.

దివ్యాంగులకు చేయూత

- నేటి నుంచి ఉపకరణాల గుర్తింపునకు శిబిరాలు
- జిల్లాలో మూడు రోజులపాటు కార్యక్రమాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈనెల 28వ తేదీ నుంచి 30 వరకు దివ్యాంగుల సహాయ ఉపకరణాల డివిజన్ స్థాయి గుర్తింపు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకురాలు కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ ఫండ్స్ సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 28న శ్రీకాకుళం జిల్లా పరిషత్‌లో, 29న టెక్కలి తహసీల్దార్ కార్యాలయంలో, 30న పలాస ఎంపీడీవో కార్యాలయంలో శిబిరాలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే శిబిరాలు ఉపయోగించుకోవాలని సూచించారు.

– ఉపకరణాల వివరాలు

బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిల్: 80 శాతం లేదా అంతకంటే ఎక్కువ వికలాంగత్వం కలిగి, చేతులు దృఢంగా ఉండేవారు అర్హులు.

మూడు చక్రాల సైకిల్: చేతులు దృఢంగా ఉండి నేలపై పాకేవారు, కాళ్లు బలహీనంగా ఉండి నడవలేనివారు, మోకాలు, పైచేయి సాయంతో నడిచేవారు, కృత్రిమ అవయవాలు, క్యాలిపర్స్ వేసుకొని నడిచేవారు అర్హులు.

– రెండు చక్రాల తోపుడు కుర్చీ (వీల్ చైర్): రెండు కాళ్లు, రెండు చేతులు పూర్తిగా పనిచేయని వారు, రెండు కాళ్లు, ఒక చేయి పూర్తిగా పని చేయని వారు, కాళ్లు పూర్తిగా పని చేయకుండా చేతులు బాగా ఉండి కూడా చేతుల సాయంతో నేలపై జరగలేనివారు అర్హులు.

చంక కర్రలు: బలహీనమైన కాళ్లు ఉండి బెల్టు సాయంతో నడవగలిగే వారు, కృత్రిమ అవయవాలు, కాళ్లు తెగిపోయినవారు, దృష్టిలోపం ఉన్నవారు అర్హులు. అలాగే బధిరులకు శ్రవణ యంత్రం అందజేయనున్నారు.

కావాల్సిన పత్రాలు

- మెడికల్ బోర్డు ద్వారా జారీ చేసిన సదరం వైద్య ధ్రువీకరణ పత్రం (40% అంతకన్నా ఎక్కువ).
- రేషన్ కార్డు లేదా ఓటర్ కార్డు.
- ఆధార్ కార్డు.
- 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు (అంగ వైకల్యం కనిపించేవిధంగా ఉన్నవి)
- యూడీఐడీ కార్డు ఉండాలి. ఒకవేళ లేకపోతే గ్రామ సచివాలయం లేదా మీసేవ కేంద్రంలో యూడీఐడీ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న ఎన్‌రోల్‌మెంట్ నంబర్ రశీదు ఉండాలి.